# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 22-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర రోడ్డు, రవాణా సంస్థలో ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రకటించారు.
- ❖ భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు.
- ❖ క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్రంలో ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంలను నిర్మిస్తున్నామని మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు.
- ❖ ప్రజలకు ఉత్తమ సేవలను అందించడమే సుపరిపాలన ప్రధాన ఉద్దేశమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు.
- ❖ బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారి బలహీనపడిందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది.

======================

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆర్టీసీలో ఖాళీలను త్వరలోనే భర్తీ చేస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. విశాఖపట్టణంలో ఈ రోజు నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది నియామకాలు చేపడతామని అన్నారు. కొత్త బస్సులను కొనుగోలు చేసి ఉచిత బస్సు ప్రయాణ హామీని నిలబెట్టుకుంటామని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 21 సెకన్లు)

కాగా, ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు.

======================

భవానీ భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర హోమ్ శాఖ మంత్రి వంగలపూడి అనిత పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. విజయవాడలోని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి ఆలయాన్ని ఈ రోజు ఆమె సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భవానీ భక్తుల దీక్షల విరమణ సందర్భంగా చేసిన ఏర్పాట్లను ఆలయ, పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా అమ్మవారి దర్శనానికి వచ్చిన పలువురు భవాని భక్తులతో ఆలయ సౌకర్యాల గురించి మాట్లాడారు. అంతకు ముందు ఆలయానికి వచ్చిన మంత్రికి కార్యనిర్వహణాధికారి కె.ఎస్. రామారావు, విజయవాడ నగర పోలీస్ కమీషనర్ ఎస్.వీ.రాజశేఖర్ బాబు స్వాగతం పలికారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కూడా అమ్మవారి దర్శనం చేసుకున్నారు.

======================

రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి ఇండోర్, అవుట్ డోర్ స్టేడియంల నిర్మాణాలను ప్రభుత్వం చేపడుతోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం, పాకలలో ఈ రోజు 68వ రాష్ట్రస్థాయి అండర్ 17, 18, 19 బాల బాలికల క్యారమ్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ... దివ్యాంగుల కోసం 200 కోట్ల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో విశాఖపట్నంలో 20 ఎకరాలలో క్రీడా స్టేడియం నిర్మిస్తున్నామని తెలిపారు. క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 18 సెకన్లు)

======================

ప్రతి ఇంటిలో ఒక పారిశ్రామిక వేత్త తయారు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సమ్మిళిత ఆర్థిక వృద్ధి సాధనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కీలక భూమిక పోషిస్తాయని అన్నారు. నిరుద్యోగ యువత వినూత్న ఆలోచనలతో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వస్తే.. ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత పరిశ్రమలు స్థాపించాలని మంత్రి కోరారు.

======================

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అల్పపీడనంగా మారి బలహీనపడింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో రానున్న మూడు రోజులలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ కోస్తా జిల్లాలలో భారీవర్షాలు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశం ఉందని పేర్కొంది. కాగా, సముద్రం ఇంకా అలజడిగానే ఉండడంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేసింది.

విరామం

======================

విశాఖ ఉక్కు పరిశ్రమకు పునరుద్ధరణ ప్యాకేజీని ప్రకటించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ను విశాఖపట్టణం ఎంపీ ఎం శ్రీభరత్ కోరారు. విశాఖలో ఆయన ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... ఉక్కు పరిశ్రమ ఉద్యోగులకు జీతాల చెల్లింపుతో పాటు మూడవ బ్లాక్ ఫర్నేస్‌కు పెట్టుబడుల విషయం మీద ఆర్థిక శాఖ మంత్రి దృష్టి సారించాలని అన్నారు. ఇదిలా ఉండగా విశాఖ స్టీల్ ప్లాంట్‌ను బలోపేతం చేయడానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి 1,650

కోట్ల రూపాయల నిధులను ఇప్పటికే  కేటాయించారని గుర్తు చేశారు. ఈ నిధులు స్టీల్ ప్లాంట్ ఉత్పత్తి కార్యక్రమాలకు సరిపోతున్నప్పటికీ, ఉద్యోగుల జీతాల కోసం మాత్రం ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఎంపీ అన్నారు.

=======================

సమర్ధవంతమైన పాలనతో ప్రజలకు ఉత్తమ సేవలను అందించడమే సుపరిపాలన ప్రధాన ఉద్దేశమని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఆయన  మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రశాసన్ గావ్ కి ఒరే-2024"లో భాగంగా జిల్లాలో ఈ నెల 19 నుండి 24వ తేదీ వరకూ సుపరిపాలన వారోత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు అవకాశం ఉందని పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

=======================

వినోద రంగంలో  ఉపాధి  అవకాశాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం వేవ్స్ కార్యక్రమాన్ని నిర్వహించనుందని ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) అదనపు డైరెక్టర్ జనరల్ రాజేంద్ర చౌదరి తెలిపారు. విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాలలో ఈ రోజు  నిర్వహించిన యువ సంగమం కార్యక్రమంలో "వేవ్స్ (Waves) సమ్మిట్" గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సంధర్భంగా రాజేంద్ర చౌదరి మట్లాడుతూ... దేశంలోని మీడియా వినోద పరిశ్రమను ప్రోత్సహించడానికి  కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది ఫిబ్రవరి 5 నుండి 9వ తేదీ వరకు వరల్డ్ ఆడియో విజువల్ & ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ (వేవ్స్)ను నిర్వహిస్తోందని వివరించారు. ప్రపంచ మీడియా, వినోద రంగంలో భారతదేశం  ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు.

=======================

రాష్ట్రంలో నీటి పారుదల రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ  మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. వైఎస్సార్ జిల్లా  కొండాపురం మండలం గండికోట ప్రాజెక్టును ఆయన ఈ రోజు సందర్శించారు.

=======================

=======================